# వాస్తవికతకి వన్నెచిన్నెలు

హైదరాబాదులో రాత్రి తొమ్మిదిన్నరకి ఒంటరిగా రిక్షాలో ఇంటికి వస్తున్నాను. బయల్దేరే వేళకి గ్రుడ్డి వెన్నెల కాస్తుంది. చంద్రుడు మాయమై మబ్బులు దట్టమైనాయి. ఇంతలోనే సన్నగా ప్రారంభమైన జల్లు వాన పెద్దదైంది. ధారాపాతంగా పడుతోంది వర్షం. రోడ్డు గతుకులు గతుకులుగా వుంది. మామూలుగా ఎత్తు పల్లాలు వుండే రోడ్డు పైకి ఎక్కవలసి వస్తోంది. రిక్షావాడు నడిచి, రిక్షాను తోసుకుపోతున్నాడు. ఎదురు ఎత్తుగా కనుపిస్తోంది. రోడ్డు. గాలి వెనక్కి త్రోసివేస్తోంది. ఒక పెద్ద చెట్టు కింద ఆపమని ఆదేశించాను రిక్షావాడి అవస్థ చూడలేక.

నీలం దీపాల వెలుగులో మెరుస్తూ పడే వానని చూస్తూ, నెత్తి మీది మర్రి ఆకుల గలగలని వింటూ కూర్చున్నాను. మనస్సు మౌనంగా వుంది. రిక్షావాలా వానకోటు, పైన టోపీ సరిచేసుకుని చెట్టు మొదట్లో కూర్చున్నాడు.

సిమెంటు రోడ్డు విశాలంగా నిర్మానుష్యంగా వుంది. ప్రక్కనే ఒక చిన్న సందు. సందులో అడుగుల చప్పుడు దూరంగా వినిపించి, దగ్గరైంది. ఒక కుర్రవాడు రిక్షా వద్దకు పరుగెత్తుకుని వచ్చాడు. ఆయాసపడుతున్నాడు. చుట్టూ కలయచూసి చెట్టు క్రింద రిక్షావాడి వద్దకు వెళ్లాడు.

"ఏయ్ రిక్షా, వస్తావా?" ఆయాసపడుతూ, ఒగరుస్తూ అడిగాడు.

"మనుష్యులున్నారు బాబూ" అన్నాడు రిక్షావాడు. ఆకుర్రాడు 'అరె' అనుకుంటూ సిమంటు రోడ్డుమీదే ముందుకు పరుగెత్తసాగాడు.

పాపం, ఏం అవసరమొచ్చిందో,నా మనస్సు పరిపరివిధాలా పోయింది. ఏదో ఆపద, అవసరం రానిదీ, ఈ కుర్రాడింతగా ఆదుర్దాపడడు ఏమొచ్చి వుంటుంది? బహుశా... పాపం ఏ స్త్రీ ఐనా నొప్పులు పడుతుందేమో. అయి వుంటుంది. లేకపోతే ఇంత కాళరాత్రి వేళ ఎవరికేమి అవస్థలు వస్తాయి అల్లాంటివి తప్ప...

పెంకుటిల్లు, ఒక వసారా, చిన్న గది. గదిలో మంచం మీద ఒక స్త్రీ పడుకుంది. విపరీతంగా మూలుగుతోందామె. ఆమె భర్త వసారాలో పచార్లు చేస్తున్నాడు.అతనికి మాత్రం ఆదుర్దా కాదూ పాపం! గదిలో గుడ్డి దీపం వెలుగుతోంది. ఒక ముసలమ్మ కూర్చుని ఏం చేయడానికీ తోచక చూస్తోంది. స్త్రీ కొడుకు పన్నెండేండ్ల వాడు.. అర్థం లేని గాభరా పడుతున్నాడు తండ్రి వంక చూస్తో... వసారాలో పచార్లు తండ్రి కొడుకు వంక హఠాత్తుగా తిరిగాడు.

"ఒరేయి, ఫో. ఒక రిక్షా తీసుకునిరా. అమ్మని ఆస్పిటల్‌కి తీసుకువెళ్ళాలి."

కుర్రాడు – ఇందాక రిక్షాకోసం వచ్చిన వాడు. ఒక్క వురకలో రోడ్డు మీదికి వచ్చేశాడు. లోపల్నుంచి ముసలిబామ్మ అరుస్తోంది.

"ఒరేయి రిక్షా ఎల్లాగురా! బండో, కారో కావాలి" అని. వినిపించుకోలేదు కుర్రవాడు. పరుగెత్తుకుని వచ్చాడు. సందు మలుపు తిరిగి సిమెంటు రోడ్డు ఎక్కాడు.

నేను దిగి రిక్షా పంపి వేస్తే బాగుండేది. సంతోషించేవాడు కుర్రవాడు. పాపమేం చేస్తాడో ఈ కుర్రవాడు. రోడ్డు మీద యిన్ని కార్లు పరుగెత్తుతున్నాయి. ఒక్క కారులో దయాత్ములుండరూ ఈ పిల్లవాడికి సాయం చేసే వాళ్ళు? ఉంటారు.

నా మనస్సు ఇంకా పని చేస్తోంది... బామ్మ మాటలు వినిపించి వుంటాయి కుర్రవాడికి. అవసరం వాడికి మాత్రం తెలీదూ? రోడ్డు మీద పోయే కారుని ఆపుతాడు. టాక్సీకోసం పోవాలని తెలియదు వాడికి. ఎదురుగా, అడ్డంగా నిలబడుతాడు. కారు ఆగుతుంది బ్రేకు వేసి. కారులో బంగారు వుంగరాలు, సిల్కు సూటు, గోల్డుఫ్లేకు సిగరెట్టు... పెద్దమనిషి.

"అయ్యా, మా అమ్మకి నొప్పులు వస్తున్నాయండి. హాస్పిటలుకు తీసుకు పోవాలండి.మీ కారు ఒక్కమాటు.. లేకపోతే మా అమ్మ చచ్చిపోతుందండి" వానలో తడుస్తూ, దీనంగా చూసే ఆ కుర్రవాణ్ణి చూస్తే ఆ పెద్ద మనిషి మాత్రం కాదనగలడా? అతను మాత్రం మనిషి కాదూ? ఒక్కక్షణం తటపటాయించి కారు తలుపు తీస్తాడు. "ఎక్కు" కారు వెనక్కి తిరిగి, కుర్రవాడు పరుగెత్తు కొచ్చిన సందు మలుపు తిరుగుతుంది...

ఏమాలోచనలివన్నీ? ఒక స్త్రీ ప్రసవిస్తూంటే ఎవరైనా పురుషుడు, పెద్దవాడు వస్తాడు కానీ, జ్ఞానం లేని ఈ కుర్రవాడిని పంపిస్తారా? అసందర్భం! ఏమిటీ పిచ్చి పిచ్చి ఆలోచనలు అర్థం లేదు.

కానీ ఏమీ అవసరం లేకుండా ఈ కుర్రవాడిల్లా ఎందుకు పరుగెత్తుకుని వస్తాడు? వెన్నెల్లాగా మెరుస్తున్న నీలం దీపాలకాంతి వంక చూశాను.ఏదో లీలగా, ఒక చక్కని యువతి నా కళ్ళముందు మెదులుతోంది.

ఒక బంగళాలో చక్కని రూం. బీరువాల్లో పుస్తకాలు, చిన్న టేబిలు, కుర్చీ, ఒక మంచం. టేబిలు మీద అగరువత్తులు పొగలు చిత్రవిచిత్రాలుగా పైకి లేచి గాలిలో లీనమౌతున్నాయి. రెండే రెండు చక్కని గులాబీలు టేబీలు మీద సౌరభం వెదజల్లటం లేదు గానీ, అందంగా మురిపెంగా వున్నాయి. ఒక యువతి మంచం మీద కూర్చుని వుంది. ఎదురుగా అద్దంలో చూసుకుంటూ ఆమె తన జుట్టుని, పమిటని సరిచేసుకుంటోంది. ఇంతలోనే చక్కగా వెళ్లి చెప్పులు వేసుకుంది.వెనక్కి తిరిగి జడను ఒక మాటు చూసుకుంది. ఆ గులాబీ పూలని సున్నితంగా చేతుల్లోవుంచి, డ్రాయరులోంచి దారం తీసి రెండింటినీ కలిపి కట్టింది. తల్లోపెట్టుకోవాలని వెనక్కి చేతులు పోనిచ్చింది. కానీ ఏమైందో తీసి వేసింది.అద్దంలో ముఖం చూసుకుని సిగ్గు పడుతూ, చిరునవ్వు నవ్వుకుంది. మెరుస్తున్న తన చెక్కిళ్ళని, అనవసరంగా చేతి రుమాలుతో అద్దుకుంది.

నా కర్థమౌతుంది ఇదంతా ఏమిటో ఈ మత్తెక్కించే వాసన,ఆ యువతి ముఖం మీది అర్థంలేని చిరునవ్వులు అన్నీ ఒక తృటిలో గ్రహించేశాను. ఆమె ఎక్కడికో వెడుతుంది. బహుశ తన భర్తని... ప్రియుణ్ణి కలుసుకోవడానికి. అతన్నిక్కడికి తీసుకువస్తుంది. ఒకవేళ స్టేషన్‌కి వెళ్ళి అతనికి స్వాగతమిస్తుంది. ఔను ఇప్పుడే కాబోలు బాంబే మెయిల్ వచ్చేది. అతడొచ్చి ఆ గులాబీలని ఆమె తల్లో తురమాలి. అదే ఆమె అభిమతం అయి వుంటుంది. లేకపోతే ఎందుకు సందేహిస్తుంది పూలు పెట్టుకోవడానికి? అతను తన ముఖం చూస్తూ, ఆ గులాబీలని తన ముఖానికి పోలుస్తూ, హాస్యాలాడుతుంటే లాలనగా అతను పూలు తురుముతుంటే ఇవన్నీ వూహించుకునే ఆ యువతి ముఖం మీది చిరునవ్వులు.

ఇంతలోనే ఉలిక్కిపడి రిస్టువాచీ వంక చూసింది. చకచక వరండాలోకి వచ్చింది. "రామూ" కుర్రవాడు వచ్చాడు. "పన్నెండేళ్ళ కుర్రవాడు... రిక్షాకోసం పరుగెత్తుకొచ్చిన కుర్రవాడు వచ్చాడు.

"స్టేషన్‌కి పోవాలి. అర్జంటుగా రిక్షా తీసుకురా" బైటికి పరుగెత్తుకు వచ్చాడు కుర్రవాడు. సందు మలుపు తిరిగి సిమెంటురోడ్డు మీదకి వచ్చాడు. నేను వున్నాను రిక్షాలో నేను దిగి రిక్షా ఇచ్చివేస్తే.. కానీ ఎందుకివ్వాలీ? ఒక యువతి తన ప్రియుణ్ణి గురించి పడే తాపత్రయంలో నాకేమిటి అనుకంప? కుర్రవాడు పాపం..... యజమానురాలు కేకలేస్తుందని వానలోనే పరుగెత్తుతున్నాడు. ఏం చేస్తాడు?

ఏమిటిల్లా పిచ్చి పిచ్చిగా పోతోంది మనస్సు అనుకున్నాను. ఐనా ఎందుకొచ్చిన పనికి మాలిన ఆలోచనలివన్నీ వూసుపోక అనుకున్నాను. వాన తగ్గింది. రిక్షావాడు లేచి వచ్చి, రిక్షా నడిపించసాగాడు. చల్లని గాలి ప్రారంభమైంది.

నాలుగైదు గజాల దూరంలో లైటు క్రింద ఆ కుర్రవాడు రిక్షాతో బేరమాడుతున్నాడు. నాకు కుతూహలం కలిగింది. అతను ఎక్కడికి బేరమాడుతున్నాడో వినాలని. రిక్షా నడుస్తోంది కాబట్టి వినవచ్చు. బైటికి తొంగి చూశాను. ఆ కుర్రాడే వానలో తడిసి ముద్దయినాడు. "ఇదుగో రిక్షా, లిబర్టీ టాకీసుకు ఏమిమ్మంటావు?" అంటున్న ఆ పసి కంఠం వినిపించింది. హోరి భగవంతుడా. గడియారం వంక చూశాను. 9.45! రెండో ఆటకి టైమయింది. అప్పుడప్పుడు తలపులు తప్పటడుగు లేస్తుంటాయని, నన్ను నేనే సమాధాన పరచుకున్నాను. రిక్షావాడు రిక్షా ఎక్కాడు. వాయు వేగంతో నేనూ, నా రిక్షా తేలిగ్గా జారిపోతున్నాం రోడ్డు మీద.

**– తెలుగు స్వతంత్ర**
**18-11-1955**